# అవాంఛితం

కొలకలూరి



ఆ సంఘటన గూర్చి విన్న దగ్గర్నుంచి రక్తంలో పోటు పుట్టినట్లయి నిలబడలేక పోతున్నాడు రవి. దిగులుగా వుంది.

బస్సు రాలేదు. ఏ సమయంలో ఏ బస్సుకు ఏమవుతుందోగానీ, ఎదురు చూచే వాళ్లకు మాత్రం ఓర్పు సన్నగిలిపోతుంది. రావలసిన బస్సు చేబ్రోలులో వుందో, పొన్నూరులోనే ఆగిపోయిందో! నారాకోడూరు స్టాండ్‌లో నానా అవస్థపడుతున్నాడు. ప్రతి అరగంటకీ గుంటూరు పోయే బస్సుండాలి, గంటయినా బస్సు రాలేదు, మరి. రవికి నిలబడే ఓపిక తగ్గిపోతూ వుంది. ఎండి నెర్రెలు పడిపోయిన చెరువు గట్టు మీదుగా వుంది గుంటూరు పోయే రోడ్డు. ఉదయం పొలం పోయిన రెండెడ్ల బళ్లు పొలాల్లో ఎరువుతోలి వస్తున్నాయి వూళ్లోకి.

మధ్యాహ్నం ఒంటిగంట. ఎండకాలపు సూర్యుడు నడినెత్తి మీద నిప్పులు క్రుమ్మరిస్తున్నాడు. వడగాలి తోలుతూ వుంది. ఊళ్లో పురుగు మెదలటంలేదు. కానీ బస్సు కోసం చూస్తున్న వాళ్లు చెట్టు క్రింద నిలబడక తప్పలేదు.

బస్సు కోసం చూచి చూచి విసుగు పుట్టింది. నుదుటి చెమట తుడుచుకొన్నాడు రవి. అయితే వడగాలి లేకపోతే ఉమ్మద. చొక్కా తడిసిపోయింది. టర్లిన్ షర్టుతో వున్న ఇబ్బందే ఇది. చెమట ఇంకిపోదు. ఆరిపోదు. గాలి తోలదు. మహోకటువుగా వుంది.

అక్కడున్నంత సేపట్లో కాల్చేసిన సిగరెట్ల సంఖ్య గుర్తులేదు. పాకెట్టు కాళీ అయింది. కొందామనుకొని, రోడ్డు ప్రక్కనే చెట్టుక్రింద వున్న బడ్డీ దగ్గరకు పోయి చూస్తే కొట్టులో కూర్చున్న మనిషి, చెమటలు కక్కుతూ గురక పెడుతున్నాడు. నిద్ర లేపితే మండిపడతాడేమోనన్న భయంతో తటపటాయించి, చివరకు ఎలాగో పిలిస్తే, ఉలిక్కిపడి లేచి, బాచిపట్టు వేసు కూర్చుని 'ఏంది' అన్నాడు.

'ఒక బర్కిలీ పాకెట్టు' పర్సులోంచి చిల్లర తీస్తున్నాడు రవి.

'ఏంది?'

రవి మళ్లీ చెప్పాడు.

'లేవు!' కాళ్లు బారజాపి మళ్లీ నిద్ర కుపక్రమిస్తున్నాడు.

'ఏం సిగరెట్టున్నాయి?'

మూసినకళ్లు తెరిచి, ఎగాదిగా చూస్తూ 'చార్మినార్' అనేసి ఆవులించాడు.

'ఒక పొట్లెట్టి వ్యాంతో'

పొటెట్టిచ్చి, చిల్లర తీసుకొని, గల్లాలో వేసుకొని కళ్ళు మూసుకొన్నాడు. రవి సిగరెట్టు ముట్టించుకొనేసరికి నిద్రపోయాడు. అక్కణ్ణుంచి బయలుదేరుతుంటే రవికి బస్సు వచ్చినంత గొడవగా గురక వినిపించింది.

బస్సు రాలేదు. చికాకుగా వుంది. ఎవరి నోట వెంట విన్నా ఆ సంఘటనే! అందరూ చిలవలు పలవలుగా ఆ సంగతే చెప్పుకొంటున్నారు. చిరాకు పుడుతూంది.

రవిది వేజండ్ల. ఎం. ఏ. చదువుకొన్నాడు. పెళ్ళి కాలేదు. చాలా సంబంధాలు వస్తున్నాయి. గుంటూరు మెడికల్ కాలేజీలో ఫైనల్ ఇయర్ చదువుతున్న వనం తను ఆమెకు తెలియకుండా చూచి, ఒక అభిప్రాయం ఏర్పరుచుకోవటానికి వెళుతున్నాడు.

మిత్రుణ్ణి తెనాలి బస్సు ఎక్కించి, గుంటూరు బస్సులోనే పోయేందుకు ఆగాడు.

'ఆ పిల్లవాడు—పాపం—ఏం చదువుకున్నాడో' బాధపడ్డాడు ఒక రైతు, చెరువు గట్టు మీద చెట్టు చుట్టూ కట్టిన చప్టా మీద కూర్చుని, చుట్టూ వున్న అందర్నీ చూస్తూ, చుట్టనుసి రాలుపుతూ.

'పాపం దురదృష్టవంతుడు, స్కూల్ ఫైనల్లో ఏమో చదువుకొన్నాడట.' రెండో రైతు చెప్పాడు. వాళ్ళిద్దరూ, అక్కడున్న అందరూ గుంటూరు బస్సు కోసమే ఎదురు చూస్తున్నారు.

ఆ సంఘటనకు సంబంధించి ఏ విషయమూ వినకూడదనుకొన్నా వినిపిస్తుంటే ఏం చేయలేక అవాసక్తంగా వింటున్నాడు రవి.

'ఏం చదువుకొన్న వాడుకాదని ఎవరో అన్నారే.'

'ఆ చదువుకొన్నా చదువుకోకపోయినా ఏంలే. వాడికది రాసి పెట్టి వుంది' రెండో రైతు నిట్టూర్చాడు.

అక్కడున్న అందరూ ఆ సంఘటన, గూర్చి విన్నారు. ఎవరికెవరూ క్రొత్తగా చెప్పవలసిన లేదు. వాళ్ళ మాటల్లో ఏమీలేదు. ఊసుపోక సానుభూతి!

'రాముడు చేసిన పని మాత్రం దర్జాగా వుంది. గొప్పపని' చుట్టకొన నములుతూ చెప్పి, కొసకొరికి ఉమ్మి వేశాడు, రైతు.

'వాడి బతుక్కి నాటికొక మంచిపని చేశాడులే. అయినా ఇంతటితో ఏమయింది. ఇకముందు వాడి బతుకు కుక్కలు కూడా పడవు. జైల్లో వుండటమే వాడి సొగసు' రెండో రైతు చాలా తేలికగా మాట్లాడాడు.

రాముడు చేసింది, తర్వాత ఏమైనా, మంచి పనే! అందులో అణు మాత్రం సంశయం లేదు. కానీ అతని భవిష్యత్తు ఏమవుతుందో తెలియదు.

రాముణ్ణి గురించి అందరూ బాగా చెప్పుకొంటుంటే హేళనగా మాట్లాడింది రైతు మాత్రమే. రాముడిది శాంత స్వభావమనీ, ఎవరి జోలికీ పోయేవాడు కాడనీ, అడిగిన వాళ్ళకు, తన దగ్గరున్నంతలో లేదనేవాడు కాడనీ, వళ్ళువంచి పని చేయటమే తెలిసినవాడనీ, చెప్పుకొన్నారుగానీ, ఇంత చులకనగా ఎవరూ చెప్పుకోలేదు.

ఎవరిని గూర్చి చెప్పుకొన్నా మంచిచెడూ వుంటాయి బొమ్మ బొరుసుల్లాగా—పగలూ రాత్రీ లాగా, వాళ్ళ వాళ్ళ దురదృష్టంకానీ, అదృష్టంకానీ ఎక్కువమంచో, ఎక్కువ చెడ్డో లోకానికి తెలుస్తుంది. మంచివాళ్ళలో అంతా మంచిగానీ, చెడ్డవాళ్ళలో అంతా చెడ్డగానీ వుండనక్కరలేదు. మంచిచెడ్డలు మనిషి మనిషికి వెలుగునీడలు.

ఎండ తీవ్రంగా వుంది. స్టాండ్‌లో చెట్లనీడల్లో తప్ప జనసంచారం లేదు. చుట్టుప్రక్కల ఇళ్ళలోంచి మనిషి బైటికి రావటంలేదు. లోనికి పోవటంలేదు. చప్టామీద రైతుల మాటల్లో రాముడి జీవితం.

''రాముడు జీతగాడు. అయిదో ఏటే వెంకన్న దగ్గర కమతానికి కుదిరాడు. చిన్నతనంలో గొడ్లు మేపుకు వచ్చేవాడు. పెద్దయాక పొలం పనులకు ఉపయోగపడుతున్నాడు.

శారీరకంగా బలంవున్నా, రాముణ్ణి మెత్తని వాడంటారు. మెత్తని స్వభావం. మెత్తని మాటలు. మెతక నడక. సిగ్గు ఒయ్యారం.

వెంకన్న తప్ప అందరూ అతన్ని ఎగతాళిగా చూస్తారు పిలుస్తారు. పిల్లలు ఆటలు పట్టిస్తారు. పెద్దవాళ్ళు పరాచికాలు పలుకుతారు. అతన్ని చూచి ఆడవాళ్ళు సిగ్గుపడరు. అతనే సిగ్గుపడతాడు.

ఇదంతా చూస్తుంటే వెంకన్నకు వళ్ళు మండిపోయింది. రాముడికి పెళ్ళి చేస్తే తప్ప వూళ్ళో వాళ్ళకి సిగ్గురాదు అనుకొన్నాడు. ఒక శుభ ముహూర్తాన వడ్లమూడి లోంచి తల్లిదండ్రి లేని పిల్లను తీసుకువచ్చి, తల్లిదండ్రి లేని రాముడితో పెళ్ళి చేశాడు.

రెండేళ్ళు కోటమ్మ ఏ పేచీ లేకుండా కాపురం చేసింది. ఇల్లాళ్ళ ఇల్లాలా కలిగారు. రాముడు చాలా సంతోషంతో మెలికలు తిరిగిపోయాడు.

ఉన్నట్టుండి ఒకరోజున కోటమ్మను గొడ్డును బాదినట్లు బాదాడు రాముడు. చుట్టుప్రక్కల అమ్మలక్కలు వచ్చి అనునయించారు. రెండురోజులు తర్వాత రాముణ్ణి వదిలేసి ఆమె వెళ్ళిపోయింది.

కొందరు రాముణ్ణి అనుమానించారు. కోటి శీలం శంకించారు. ఏమయినా భార్య లేక, తిండితిప్పలు లేక, హోపాళాలేవి అట వాట్లు వచ్చి, మళ్ళీ యజమాని ఇంటి దగ్గరే చేరాడు, రాముడు. ఏడాది గడచింది.

ఎన్నోసార్లు భార్యను బ్రతిమాలి తీసుకు రావాలనుకొన్నాడు. అందుకూ సిగ్గే అడ్డమయింది.

రాముడి హృదయం ఎరిగిన వెంకన్న అన్నిటికీ నేనువున్నానని మాట యిచ్చి, కోటిని కాపురానికి తీసుకువచ్చాడు.

పెళ్ళి అయినప్పుడూ అయ్యాకా లేని అందం, ఆ ఏడాదిలో కోటి శరీరమంతా కొత్తగా వికసించింది. వెంకన్న ఆలస్యంగా గమనించాడు.

రాముడికి మళ్ళీ కొంపాగోడీ ఏర్పడ్డాయి. చాలా సంతోషంతో వున్నాడు. కోటిని నోరెత్తి మాట అనలేదు. చేయెత్తి కొట్టలేదు. అవధిలేని ఆనందానికి అవతలి గట్టులాగా కనిపించాడు.

వెంకన్న పరిస్థితి గమనించాడు. స్వార్థం తలెత్తింది. ఊరి వెలుపలి పాగాకు బేరన్ దగ్గర పాకవేయించి రాముణ్ణి కావలా వుంచాడు.

అప్పణ్ణుంచి కోటికి స్వేచ్ఛ అధికమూ అయింది. పరిమితమూ అయింది. వాళ్ళిద్దరికీ ఏంకావాలో చూచుకొంటూ వున్నాడు వెంకన్న. ఎప్పుడో తిండికి తప్ప ఇంటికి రాడు రాముడు. ఎప్పుడూ ఇల్లు విడిచి వెలుపలికి రాదు కోటి.''

ఇక తర్వాత వినిపించిందంతా ఇంతకు ముందే విన్న సంగతి. రవికి రాముడి మీద సానుభూతి కలిగింది.

బస్సు రాలేదు.

బస్సు కేమయినా యాక్సిడెంటు అయిందేమో! ఒక బస్సు కాకపోతే రెండో బస్సు

అయినా రావచ్చునే! ఏమిటో! రవికి చికాకు పెరిగిపోతూ వుంది.

రవికి వసంత గుర్తుకు వచ్చింది. ఆమె ఎలా వుంటుందో! బాగానే వుండవచ్చు. ఏమయినా చూచిందాకా ఏమాటా చెప్పలేడు.

ఏది ఏమయినా పెళ్ళిచూపులకు వెళుతున్న యువకుడు. ఆ ఆలోచనే దర్జాగా వుంటుంది. వి. వసంత! పేరున్నంత అందంగా మనిషి ఉండవచ్చు. ఆమె అందంగా వుంటుందనుకోగానే సిగ్గు కలుగుతూ వుంది ఛీ! మగాడికీ సిగ్గేమిటి!

ఆమె కెంత ఆస్తివుంది, ఎంత కట్నం వస్తుంది. కుటుంబ పరిస్థితులేమిటి. ఇటువంటి విషయాలు ఏవీ రవికి అక్కర లేదు. అవన్నీ పెద్దలు చూచుకొనే వ్యవహారాలు. ఆమె హాస్టల్లో ఉంటుంది. వెళతాడు. ఎవరో అపరిచితుడైన విజిటర్‌లాగా ఆమెను చూస్తాడు. పలకరిస్తాడు. మంచి చెడ్డలు నిర్ణయించుకొంటాడు. ఏ విషయమూ ఇంట్లో చెబుతాడు. ఆ సంగతే పిల్ల తల్లిదండ్రులకు తెలుస్తుంది.

బస్సు రాలేదు.

సిగరెట్టు ముట్టించుకొని రోడ్డుమీదికి వచ్చిచూశాడు. బస్సు జాడలేదు. ఎర్రగా దుమ్ములేస్తే బస్సే అనుకొన్నాడు. కాదు మరి! లారీనిచూస్తే అకారణంగా వళ్ళు మండింది.

వళ్ళంతా మండుతున్నట్లుంటే కళ్ళ ముందు వెన్నెల నడచినట్లయింది. యువతి చాలా అందంగావుంది. ఇరవై రెండు సంవత్సరాలకంటే ఎక్కువ వయస్సుండదు. తీర్చి దిద్దినట్లున్న అవయవాలు. రవి రోడ్డు మీద అలాగే నిలబడి, ఆమెనుచూస్తూ వుండిపోయాడు.

ఆమెను ఎక్కడనో చూచినట్లు అనిపించింది. బహుశా ఎక్కడా చూచి ఉండక పోవచ్చు. తనకు కాబోయే భార్య ఇలా ఉండాలని వూహించుకొంటూ వుండవచ్చు. వూహాలోకంలోని రూపం వాస్తవ జగతిలో కనిపించేసరికి వసంత ఇంత అందంగావుంటే చాలుననుకొన్నాడు రవి.

చప్టామీద కూర్చున్న వాళ్ళలో కలకలం బయలుదేరింది.

'అదుగో!'

'విచారంలేదు!'

'పీడ విరగడవుద్దిలే అని సంతోషం!'

'ఎక్కడికో బయలుదేరింది!'

# అవాంఛితం

'అక్కడికేనేమో!' అందరూ గలగలా నవ్వారు. ఆమె వెనుదిరిగి చూచింది. కాండ్రించి తుపుక్కున ఉమ్మివేసి వెళ్ళిపోయింది. రవి గతుక్కుమన్నాడు.

తర్వాత తెలిసింది. ఆమె రాముడి భార్య! కోటి!!

రవి వెంటనే అనుకొన్నాడు. "అయితే ఆశ్చర్యంలేదు." వాళ్ళు చెప్పుకొన్నది నమ్మశక్యంగాని సంగతేమీకాదు.

వూరవతల రోడ్డుమీద మళ్ళీ ఎర్ర దుమ్ములేచింది. బస్సురాలేదు. లారీ వచ్చింది. ఆగకుండా వెళ్ళిపోయింది. ఆగితే ఎలాగో ఒప్పించి లారీలోనే గుంటూరు చేరి వుండేవాడు. రాత్రయితే మంచిదికాదు గానీ పగలేం? అయినా లారీ ఆగనయినా ఆగలేదు. లారీ కాబిన్‌లోకూర్చుని, బస్సు చార్జీమాత్రమే చెల్లించి ప్రయాణం చేయటం కొత్తేమీకాదు. మామూలే!

విపరీతంగా చెమట! కర్చీఫ్‌తో తుడుచుకొన్నాడు. ఒకచోట నిలబడలేకపోతున్నాడు. కోపంగా, బాధగా, అసహనంగా, చిరాకుగా, అటూ ఇటూ తిరుగుతూ ఉన్నాడు.

'క్లీనర్‌ది ఈ వూరే!'

'నిజమేనా? ఎక్కడ వాడిల్లు?'

'ఈ చెరువుగట్టుమీదే! అదుగో ఆ తాటిచెట్టుదగ్గర ఇల్లు! కుడిపక్క బావి దగ్గర. తాటాకుల కొంప. రెండు నిట్టాళ్ళదికాదు. ఒంటినిట్టాటిది. కనిపించలా?'

'ఆ! అవునవును!'

'అదే వాడిల్లు!'

'అహా'

'కోటితో పూర్వ పరిచయం కాస్తంత వున్నవాడే!'

'ఏంది? ఎట్టెట్టా?'

'కాస్తేందిలే—బాగానే— మొదటిసారి రాముడు కోటిని కొట్టింది వీడిమూలానే'

'అట్లా జెప్పు!'

'ఈమధ్య వెంకన్న కథ ప్రారంభమయింతర్వాత కోటి పతివ్రత అయింది.

అందరూ నవ్వారు. ఆ సమయంలో చప్టామీద కూర్చున్న జనం మాటల్లో గుండెల్లో కోటి బస్సుతప్ప మరేమీ లేవు. కోటి ప్రస్తావనరాగానే రవి వాళ్ళ వైపు చూశాడు. బస్సు రాకపోతే కోటి సంభాషణ. బస్సువొస్తే అన్నీ మరచి పోయి ప్రయాణం. ఇంకొక్క గంట దాకా బస్సు రాకపోతే కోటి బ్రతుకు వీళ్ళ నోళ్ళలోబడి, ఎండలో రోడ్డుప్రక్క చెట్టుక్రింద వడగాలి దెబ్బతగిలి సొమ్మసిల్లిపోవలసిందే

"క్లీనర్ బీదవాడు. పెళ్ళయింది. నలుగురు పిల్లలు. పెద్దపిల్ల పెళ్ళికెదిగింది. పెళ్ళి చేయాలని తొందర! డబ్బు లేక అగచాట్లు!!

చిన్నప్పట్నించి లారీ క్లీనర్‌గా ఉన్నాడు. పెరిగి పెద్దవాడయి, సంసారం పెరిగి యాతనపడుతున్నా, ఉద్యోగం మాత్రం యధాపూర్వకంగావుంది. ఆమధ్య డ్రైవింగ్ లైసెన్సు సంపాదించాడు. అయినా ప్రమోషన్ రాలేదు. హొనర్‌కు బెంజి లారీ త్వరగా వస్తే, తను డ్రైవర్ అవుతాడు. జీతం పెరుగుతుంది. ఆ కలలు కంటుంటే కాలం గడిచిపోతూవుంది.

రెండు వేలయినావుంటే కూతురు పెళ్ళవుతుంది. హొనరును అడిగాడు. లేదనే సమాధానం. డ్రైవర్‌ని అడిగాడు. 'నా దగ్గరెక్కడుందీ?' అని జవాబు. క్లీనర్‌కు ఈమధ్య డబ్బు ఎలా సంపాదించాలి అనే ఆలోచనతప్ప మరే ధ్యాసలేదు. డబ్బుకూ మనుష్యులకూ మధ్య ఉన్న సంబంధం బాగా తెలిసి వళ్ళు మండిపోయింది. జీవితం మీదే విరక్తి పడుతూవుంది.

కోటిదగ్గర డబ్బుంది. అడిగితే లేదనక పోవచ్చు. కానీ అడగటానికి వీలులేకుండా పోయింది. వెంకన్న రాముడి గృహ యాజమాన్యం స్వీకరించిం దగ్గర్నుంచి, కోటి నల్లపూస అయిపోయింది. కంటికి కనిపించటంలేదు. ఆ యింటి ఛాయలకుపోవటం గొడవే! పోయినవాళ్ళకు ఏ గతిపట్టిందో తనకు బాగా తెలుసు.

ప్రొద్దు పొడిచిం దగ్గర్నుంచి, ప్రొద్దు క్రుంకేదాకా డబ్బు అతనికి పెద్ద ప్రశ్న. ప్రొద్దు క్రుంకిందగ్గర్నుంచి ప్రొద్దు పొడిచే లోగా వచ్చే ఆలోచనలు—తీరేమార్గం తెలియకపోయినా, అవకాశం రాకపోయినా, అనుభవం లేకపోయినా—చక్కని జవాబులు.

హొనరు ఇంట్లో దొంగతనం చేయాలని క్లీనర్ అనుకోకపోలేదు. దానివల్ల ఉద్యోగానికి ప్రమాదముందని వూరుకొన్నాడు. డ్రైవర్‌ఇంట్లో!— వీలులేదు. ఇంకెన్నెన్నో ఆలోచనలు. ఫలితం శూన్యం.

[illegible] లోకంమీద కసి! ద్వేషం!! [illegible]!!!''

క్లీనర్ జీవితంమీద రవికి కోపం వచ్చింది. సానుభూతి కలిగింది.

తెనాలినుంచి చేబ్రోలుపోయే బస్సు కొడూరులో ఆగింది. ఎవరో ఇద్దరు దిగారు. నలుగురు ఎక్కారు. బస్సు వెళ్లిపోయింది. ఒకతను వూళ్లోకి వెళ్ళాడు తలమీద కండువా కప్పుకొని. రెండో వ్యక్తి చప్టామీద చేరాడు. అతను బుడంపాడు పోవాలి. కాబట్టి గుంటూరుపోయే బస్సు ఎక్కాలి. రెండు గంటలనుంచి బస్సు ఏదీ రాలేదని తెలిసి, చాలా త్వరలో ఏదైనా బస్సు రావచ్చునని ఆశతో కూర్చున్నాడు.

అతను టీచర్. పంచె! ముతక లాల్చి! పైన కండువా! లాల్చిజేబుకు సిరామరక! ఎద్రొమ్ముమీద లాల్చి పట్టీకి పెన్ను పెట్టుకొన్నాడు.

అతనికీ సంఘటన కొత్త! చప్టామీద సంభాషణ అతనికి విన బుద్ధిపుట్టింది. బీడీ అంటించుకొని, అరుగుమీద కూర్చున్నాడు పైపంచె సరిజేసుకొని. ధోవతి పైకిలాక్కొని అంతా విని 'లోకం ఘోరాతి ఘోరంగా తయారయింది!' అంటూ నిట్టూర్చాడు. 'డ్రైవర్ కారణమనుకొంటాను' అన్నాడు.

'అదేంకాదయ్యా పంతులూ! వోనరుగారే అని నా అనుమానం' అన్నాడు చుట్ట కాలుస్తున్న రైతు.

'వోనరుకు అంతధైర్యంవుండే అవకాశం లేదు. భయం వుంటుంది.'

'భయం—నా బొంద—వాడికి భయమేమిటి? వాడి సంగతి నీకేమీ తెలిసినట్లు లేదే—వాడూ......'

పంతులు చప్టామీద చేరి సంభాషణలోకి దిగేసరికి తీగలాగితే డొంకంతా కదిలినట్లయింది.

''వోనర్ పేరు వీరన్న. వీరన్నపుట్టేనాటికే తండ్రి గతించాడు. మూడేళ్ళ వయస్సులో తల్లి చనిపోయింది. అతను పెరిగి పెద్దవాడవుతున్నకొద్దీ (ఎత్తు పెరగలేదు) పొట్టివాడికి పుట్టెడు బుద్ధులన్నట్లు (బుద్ధి చాలా ఎత్తు పెరిగింది) కో అంటే కోటి. కోటి బుద్ధులు. కోటి ఆలోచనలు. అమ్మా నాన్నలు ఇచ్చిపోయింది కుంటనేలయినా వీరన్న ప్రస్తుతం కోటీశ్వరుడు.

# అవాంఛితం

పుట్టిన క్షణంలో దమ్మిడీ విలువ చేయని వీరన్న వయస్సు వచ్చాక అంత ఆస్తిపరుడెలా అయ్యాడు అని అడిగితే, గిట్టనివాళ్ళు దొంగతనంచేశాడనీ, దోపిడీలు చేశాడనీ, బేంకుచోరీలో ప్రథమ ముద్దాయి అని ఏవేవో చెబుతారుకాని అది నిజం కాకపోవచ్చు. ఎందువల్లనంటే అతనెప్పుడూ జైల్ ముఖం చూడలేదు.

అతనంటే ఇష్టం లేకపోయినా, కష్టం లేనివాళ్ళు, పాపం స్వయంకృషితో పైకి వచ్చాడు. వస్తూ వస్తూ ఇంత పాపం కూడా తెచ్చుకొన్నాడు అంటారు. ఆపాపం దాని వ్యవహారం ఏమిటంటే ఎవరూ ఏమీ చెప్పలేరు.

వీరన్న చేబ్రోలు పొగాకు వ్యాపారం చేశాడనీ, అయిదు పెళ్లిళ్ళు చేసుకొన్నాడనీ, గుంటూరులో పెద్ద పొగాకు కంపెనీ ఉందనీ, పది లారీలు ఉన్నాయనీ చాలా మందికి తెలుసు.

పొగాకు కంపెనీలో గ్రేడింగ్‌చేసే అందమైన ఆడపిల్ల అతనిబారినుంచి తప్పించుకుపోలేదని అంతరంగికులకు మాత్రమే తెలుసు.

మొదట్లో నాటుపొగాకు వ్యాపారం చేసి కొంత నిలువవేసి, తర్వాత చిన్న పెట్టుబడితో దొర పొగాకు వ్యాపారం ప్రారంభించి, బాగా లాభాలు గడించి, పల్లెల్లోవుండే పొగాకు బేళ్లు చేరవేసుకోవటానికి గుంటూరు చేరవేయించటానికీ లారీలు కొన్నాడనీ, సీజన్ లేని సమయంలో బాడుగకు పంపుతుంటాడనీ—ఈవిధంగా ధనార్జన బాగా పెరిగిపోయిందనీ చెప్పుకొంటూవుంటారు పనివాళ్ళు.

ముప్పయిఏళ్లదాకా వీరన్న పెళ్లి చేసుకోలేదు. అప్పటికే అతని స్త్రీకాంక్ష చాలా వరకు తీరిపోయింది. అటువంటి మనిషి పెళ్లి చేసుకోవటానికి కారణాలు రెండు! ఒకటి ఆస్తి, రెండు ప్రతి మగవాడికీ భార్యంటూ ఒక ఆడమనిషి వుండాలనే భావన!

వీరన్న చేసుకున్న అయిదు పెళ్ళిళ్ళ—పదిహేనుఏళ్లలో—చాలా డబ్బు తెచ్చాయి. నలుగురు భార్యలూ చనిపోతూ ఎంత ఇన్సూరెన్సు డబ్బుతెచ్చారో, వీరన్నకూ, ఇన్సూరెన్సు ఏజంట్‌కూ, ఆఫీసుకుతప్ప మరెవరికీ తెలియదు.

వీరన్న అయిదోభార్య చూలాలు. ఇంకో నెలకు అంతా సవ్యంగా వుండివున్నట్లయితే ప్రసవవేదనలో ఆమెకూడా చనిపోయి వుండేది. ఇన్సూరెన్సు మొత్తం వచ్చి వుండేది. కాని మాయదారికాలం దారి తప్పిపోయింది లారీలాగా.

కామాంధుడైన వీరన్నకు నిండు చూలాలు ఎద్దులాగో మొద్దులాగో సంసారం లేకుండావుంది. గ్రేడింగ్ చేయిస్తుంటే ఎండకీ పొగాకు చూర్ణం అయిపోతుందని, కంపెనీ కట్టేయటంతో, గ్రేడింగ్ ఆడవాళ్ళు పది రోజుల్నుంచి కనిపించటంలేదు.

స్త్రీకోసం డబ్బు ఖర్చు చేయుటమంత తెలివి తక్కువ పని మరొకటిలేదని వీరన్న సిద్ధాంతం. ఆ సిద్ధాంతం పదిరోజుల్నుంచి వీరన్నను లంఖణం చేయించింది.

నల్లగా తుమ్మమొద్దులాగావుండే వీరన్న ఏం చేసినా బండపనే! రెండు చేతులతో సంపాదిస్తాడు. రెండుకోళ్ళనుతింటాడు. రెండు బుడ్లు తాగుతాడు. ఒక్క ఏ ఒక్కటితోనూ తృప్తిపడడు.''

బస్సు రాలేదు.

రెండున్నర గంటలనుంచి బస్సురాలేదు. అంత ఆలస్యం సాధారణంగా ఆరూట్‌లో ఎప్పుడూ జరగదు. ఈ బస్సులకు పోయేకాలం రాలేదు కాబోలు. రవికి వళ్ళు మండిపోయింది. 'ఉష్ణమ్ ఉష్ణేన శీతలమ్' అని కాఫీ తాగుదామనుకొన్నాడు.

సిగరెట్టుబడ్డీలకు అవతల, తాటాకు పాకపేరు హోటల్. రవి బయలుదేరాడు. చప్టామీదకూర్చున్న పంతులు గబగబా వచ్చి రవివెంట నడుస్తున్నాడు.

'మీరెవరుసార్!' ప్రశ్నించాడు.

రవి చెప్పాడు

'ఈ ఘోరం విన్నారా?'

'విన్నాను!'

పంతులు మరేం మాట్లాడలేదు. ఇద్దరూ హోటల్‌ముందుకువచ్చారు. అక్కడ ముంజల బుట్టలున్నాయి. బస్సులు వస్తే 'వాళ్ళ' ముంజలు గుంటూరులో అమ్ముకొంటారు. ముంజలవాళ్ళు అవి పాడయిపోతాయనే దిగులుతో ఎంతకీ బస్సు రాకపోవటంతో హోటల్‌ముందు చింతచెట్టుక్రింద చింతాకుల చిత్తుపై కూర్చున్నారు. చింతాకులు రాలి ముంజల బుట్టలమీద కప్పిన మురికి బట్టలపైన పడివున్నాయి.

హోటల్ చుట్టూ మట్టి గోడలు.

[illegible] రాళ్ళమీదవున్న చెక్కలు కుర్చీలుగా టేబిళ్ళుగా ఉపయోగపడతాయి. రాత్రి పడితే, ఆ చెక్కలే మంచాలు.

వెనుకపక్క పొయ్యి అంటే కిచెన్ వుంది. మధ్య పిట్టగోడ అడ్డం వుంది. హోటల్ ప్రొప్రయిటర్—కమ్—కాషియర్—కమ్—సర్వర్—కమ్—క్లీనర్—కమ్—కుక్ పొయ్యి ముట్టించాడు. పాకనిండా పొగ.

క్రమక్రమంగా పొగతగ్గిపోయింది. బల్లలు కనిపించాయి. వాటి మీద ఎక్కడ కూర్చోవాలో అంతుపట్టలేదు. కాళీ గ్లాసుల కాఫీవీ నీళ్ళవీ ఉన్నాయి. గ్లాసులంటే గాజు గ్లాసులు కాదు. జర్మన్ సిల్వర్. చెక్కల మీద నీటి తడి, కాఫీ మరకలు, పచ్చళ్ళ అంటులు, కాళీ ఆకులు—అంతా మహా రణరంగంలాగా వుంది. రవి కూర్చోటానికి సంకోచిస్తున్నాడు. పంతులు కొన్ని గ్లాసులు తొలిగించి, కొంత తడి తుడిచి, కూర్చునే తావు, బ్రహ్మలాగో, విశ్వామిత్రుడి లాగో సృష్టించాడు.

పొయ్యి దగ్గర్నుంచి హోటల్ సర్వాధికారి వచ్చాడు. 'ఏం కావాలి సార్!' ప్రశ్నించాడు. రవి మాట్లాడలేదు. 'ఏముంది?' పంతులు ఎదురు ప్రశ్న వేశాడు.

'హాట్గా బజ్జీ—కొంచెం వేడిగా ఇడ్లీ!'

''ఒకప్లేట్ బజ్జీ,రెండు కాఫీ'' చెప్పాడు.

'కాఫీ స్పెషలా? ఆర్డినరా?'

'మంచి కాఫీ!'

టీచర్ ఏమీ మాట్లాడలేదు. సర్వాధికారి, బజ్జీ ప్లేటు తెచ్చి బల్ల మీద పెట్టాడు. నోరు వూరుతూ వుంటే ప్లేటు వైపు చూస్తూ 'తీసుకోండి చల్లారిపోతుంది' అన్నాడు.

'నాకు కాదు. మీరే తీసుకోండి' అని చెప్పాడు.

'నాకా?' అని, మరి మాట్లాడకుండా, మాట వరుసకయినా 'అదేం నాకెందుకు వద్దులే' అనకుండా గబగబా ప్లేటు తీసుకొన్నాడు.

రవికి ఎదురుగా ఇద్దరు కూర్చుని వున్నారు. చెక్క మీద బాచి పట్టు వేసుకొని బీడీ కాలుస్తున్నాడొకాయన. రెండో వ్యక్తి కాళ్ళు ఆరజాపి వున్నాడు.

'వాడు చాలా దుర్మార్గుడు. నాకు మొదట నుంచీ వాడి మీద అనుమానమే!'

'వాడెంత దుడుకుగా లారీ తోలుతాడనీ, [illegible] కోళ్ళు ఎన్నో చచ్చిపోయాయట'

'అంతేనా? మొన్నీమధ్య వాడి లారీ క్రింద ఆవుదూడ బడి చచ్చిపోయింది.'

'వెధవ పూటీగా తాగుతాడట. వళ్ళు తెలియకుండా వుంటాడు. డ్రైవింగ్ సీటులో కూర్చుంటే సింహాసనం మీద కూర్చున్నంత నిక్కు. తిక్క కుదిరిందిలే!'

''డ్రైవర్ పేరు వాగులు. నిజంగా వాగుబాము లాగా బారు. నిండు లారీలాగా లావు. అంతెత్తు వాగులు ఇంత పొట్టి వీరన్న దగ్గర ఎలా చేరాడో సృష్టి విలాసం అర్థంకాదు.

చిన్నప్పటినుంచీ వాళ్ళకు స్నేహం. వీరన్న నాటు పొగాకు వ్యాపారం చేసే దగ్గర్నుంచి నాగులు పనివాడుగా మీదుమిక్కిలి మిత్రుడుగా వుంటున్నాడు. వీరన్న బుర్ర, వాగులు వళ్ళు వాళ్ళిద్దరికీ భయంలేకుండా చేశాయి.

వీరన్న వ్యాపారం అభివృద్ధి అయినకొద్దీ కల్లు దగ్గర్నుంచి ఫారెన్ విస్కీదాకా తాగుడు పెరిగింది. అదంతా అందుబాటులో వుంటే సరి, లేకపోతే సరఫరా చేసే పంతు వాగులుది. వీరన్న తాగి వదిలిపెడితే, మిగిలింది తాగటం వాగులుకు కూడా అలవాటయింది.


ఆపైన వీరన్న దొరలు తాగే బుడ్ల [illegible] విశార్పుగా సేవించేవాడు. సిఫార్సు చేసేవాడు.

వీరన్న లేకుండా వాగులుకు అస్తిత్వం లేదు. వాగులు లేకుండా వీరన్నకు వ్యక్తిత్వం లేదు.

వీరన్న లారీలు కొన్నాక వాగులు డ్రైవర్ అయ్యాడు. ఆపైన పెళ్లి చేసుకొన్నాడు. పూటీగా తాగి తూలే భర్తను చూచి, వీలున్నప్పుడు రుచి చూడటంతో ప్రారంభించి, అంతో ఇంతో తాగి, కొద్దోగొప్పో జీర్ణించుకోగల ధీమంతురాలయింది భార్య.

భార్య శక్తి సామర్థ్యాలు బాహాటంగా గుర్తించాక వాగులు సారాయి వ్యాపారం ప్రారంభించాడు. లారీ ఏ ట్రిప్పులోనైనా పొగాకో, మరేదో తోలుకువస్తూ పనిలో పనిగా సారాయి కూడా సరఫరా చేయటం నాగులు అలవాటు చేసుకొన్నాడు. స్వామి కార్యంతోపాటు స్వకార్యం కూడా జరుగుతూ వుంది. వ్యాపారంలో మంచి రాబడే వుంది. మేడ కట్టించాడు.

వీరన్న ఆకలి వేటకు ఆయుధాల వంటి 'మందులు' తెచ్చి ఇవ్వటమేకాక, జంతువుల ఎగుమతి దిగుమతి కూడా వాగులు వంతు అయింది. ఆ జంతువుల్లో ఒకటో అరో తనకూ ఆహారమవుతూ వుండటంచేత, బాగానే వుంది పరిస్థితి.



వాగుతూ నమ్మినేబంటు. పిరన్న కావాలని అడిగితే (ఎప్పుడూ అడగలేదు) తలయివా ఇస్తాడు, (ఒక విషయంలో మినహాయింపు) ఆ పరిస్థితి రాలేదు.''

కాఫీపూర్తిచేసి, రవి బిల్లు చెల్లిస్తుంటే 'నేనిస్తానులెండి' అనలేదు పంతులు. ఎటో చూస్తున్నాడు. ఇద్దరూ వెలుపలికి వచ్చారు, చీకటి కోణాలలోంచి వెలుగు లోకాలలోకి వచ్చినట్లు. 'థాంక్సండి' అన్నాడు పంతులు మరేమీ మాట్లాడకుండా కళ్లతో.

అప్పుడు పరస్పరం పరిచయమయింది. పంతులుకు వడ్లమూడిలో ఉద్యోగం. వేసవి సెలవులకు స్కూల్ మూసి ఇంటికి వెళుతున్నాడు, బుడంపాడు. ఇంటి దగ్గర భార్యకు నిండునెలలు!

పొన్నూరు పోయే బస్సు గుంటూరు నుంచి వచ్చింది. ఆగింది. పదిహేను మంది దిగారు. బస్సు వెళ్లిపోయింది.

గుంటూరు పోయే బస్సు రాలేదు. బస్సు దిగిన వాళ్లలో కొద్దిమంది రాత్రి జరిగిన సంఘటన గురించి చెప్పుకొంటూ వెళుతున్నారు. మాటల సందర్భంలో 'రాముడు పోలీసు స్టేషన్‌లో వున్నాడు' అని తెలిసింది. అంతా కలకలం చెలరేగింది, మళ్లీ.

'అసలా దురదృష్టవంతురాలి సవాల్'

'టీచర్ ఆటనే'

'కాదంటగా. చదువుకొనే అమ్మాయి అని ఏందో ఎవరో చెప్పారే!'

'లే! భర్త దగ్గరకు పోతావుందట.'

రవి అనుకొన్నాడు.

'టీచర్ అయివుంటుంది. భర్త దగ్గరకు పోతావుండి వుంటుంది.'

*　　*　　*

''సాయంత్రం ఏడు. సూర్యుడస్తమించాడు. చీకటి వర్షంలాగా వస్తూ వుంది. అప్పటి కింకా మసక వెలుతురు. పల్లెలోంచి బయలుదేరి, ఎండి, పగుళ్లుబడి, కోపులు తేలి, వున్న వరిచేలల్లోంచి కాలిబాటలో యువతి, అమెకంటే చిన్నవాడయిన యువకుడు నడచి వస్తున్నారు. ఇద్దరూ రోడ్డు మీదికి వచ్చారు. గుంటూరు పోయే బస్సు ఏడున్నరకు వస్తుంది. ఎదురు చూస్తున్నారు, సాధారణంగా సాయంకాలం బస్సు కాళీగా వస్తుంది. ఆమె అక్క. అతను తమ్ముడు, అక్కను గుంటూరులో దిగవిడిచి రావటం కోసం వచ్చాడు. పదహారు సంవత్సరాల వయస్సు ఉండవచ్చు. ఏపుగా పెరిగిన లేత మామిడి కొమ్మలాగా వున్నాడు.

ఆమె వయస్సు ఇరవై కంటే ఎక్కువే అచ్చుపోసిన అందం లాగుంది. అవయవాలు పరిపూర్ణతను పొందాయి. అలంకరణవల్ల ఆకర్షణ పెరిగింది. మెడ నిటారుగా వుంది. యవ్వనం, అందం, చదువు, ఆభిజాత్యం అన్నీ ఆమెకీ ఉన్నాయన్నంత, గర్వంగా ధీమాగా తలవంచుకోవటం చేతకానట్టు, ఎరుగనట్టు నిలబడి వుంది.

ఆమె చేతులకు బంగారు గాజులు, రిస్టువాచీ వున్నాయి. మెడలో హారం, చెవులకు వెడల్పు రింగులు ఉన్నాయి. తలలోపూలు, మెడలో మాంగల్యం లేవు. ఆమెలో స్త్రీత్వం లేదు. పసితనమే వుంది. పసితనం పుంజుకొంటున్న స్త్రీత్వపు బింకమే గర్వంలాగా కనబడుతూ వుంది.

ఏడున్నర అయింది. దూరంగా బస్సు. సిద్ధంగా నిలబడ్డారు. బస్సు దగ్గరకు వచ్చింది. చేతులెత్తారు. ఆగలేదు. వెళ్లిపోయింది. జనం కిటకిటలాడుతున్నారు బస్సునిండా!

తమ్ముడి ముఖంలో నిరాశ, నిస్పృహ అలముకొన్నాయి. ఆమె లెక్కా జమాలేనట్టు అలవోకగా ఎటో చూస్తూ నిలబడింది.

అప్పటికే అమావాస్య చీకటి దట్టంగా వ్యాపించింది. విలయంగా క్రమ్ముకొంది. వికారం నిలబడింది. వికటాట్టహాసం చేస్తూ వుంది. పదిగజాల దూరంలో మనిషి నడిస్తే అలికిడి వినబడవచ్చు కానీ మనిషి కనబడటంలేదు.

ఎనిమిదయింది. బస్సు రాలేదు. గడియారంలో రేడియం డైల్ ఎగతాళిగా నవ్వుతూ వుంది.

తమ్ముడికి అశాంతి. చిరాకు. అసహనత. నిట్టూర్పు. బస్సు వస్తున్న సూచనలేదు.

'ఇంటికెళదామా' తమ్ముడు అడిగాడు.

'బస్సు వస్తుందిలేరా?' అక్క చెప్పింది.

'నీ మొండి నీది!' తమ్ముడు గొణిగాడు.

మాటల్లోనే ఎనిమిదిన్నర! లాస్ట్‌బస్సు వచ్చేటైం! అయినా రెండు బస్సులు రావాలి! కాళీగా ఏ బస్సు అయినా వస్తుంది.

'ఏందివాళ?' తమ్ముడు ఇంతవరకు బస్సు రాలేదేమని దానికి అర్థం.

'ఏమోరా?' అక్క. ఏమీ తెలియని తనానికి గుర్తు.

మాటల్లోనే తొమ్మిది దాటిపోయింది. తమ్ముడికి దాదాపు కోపం వచ్చింది:

'నేనుండ నింక!'

'అట్లా అంటే ఎట్లారా?'

'మరి? ఈ చీకట్లో 'ఏం ప్రయాణం?'

'తప్పకుండా పోవాలిరా!'

'నువ్వుపో! నేనింటికి పోతాను'

'మాబాబు కదూ! మంచివాడివి. అలా అనొద్దు. బస్సు వస్తుంది. ఇద్దరం వెళదాం. కోపం వద్దు' ఆమె ప్రతిమాలింది.

'నువ్వొస్తేరా లేకపోతే లేదు. నేనింటికి పోతున్నాను' నిశ్చయంగా చెప్పాడు.

'పోరా! నీ యిష్టం. నువ్వు వచ్చినా రాకపోయినా నేను మాత్రం వెళతాను. ఏవిధంగా అయినా వెళ్లాల్సిందే! రేపు ఉదయమే పరీక్షాయే!' ఆమె స్థిరంగా చెప్పింది.

చీకటి. చీకటికే భయం పుడుతూ వుంది. ఇలకోళ్ల అరుపులు! మనుష్యులు మెదలటంలేదు. కటిక చీకటి. కళ్లు పొడుచుకు చూచిన కానరాని చీకటి. మిణుగురు పురుగుల మిలమిలలు! ఎక్కడో నక్కల ఊళ! గుడ్లగూబల అరుపులు! చెట్లు రాసిడి. గాలి ఈలలు! దెయ్యాల సంగీతంలా గా వుంది.

తమ్ముడి గుండె వేగంగా కొట్టుకొంటూ వుంది. ముఖం చీకటి కంటే నల్లగా అయిపోయి వుండాలి. కనిపించటంలేదు. ఇంటికి పోదామనుకొన్నాడు భయంతో. అక్క ఏమవుతుందోనని అంతకంటే భయం! అక్కడే వుండవలసి వచ్చింది. ఉండలేక పోతున్నాడు. వెళ్లాలనుకొన్నాడు. వెళ్లలేక పోతున్నాడు. ఈ దేశంలో, ఆ స్థితిలో ఏ తమ్ముడూ, ఏ అక్కనూ వదిలిపోడు. ఇది తరిగిపోని సంపద. ఇది ఇలాగే, ఈ అనుబంధం ఈ విధంగానే, శాశ్వతంగా వుంటుంది. మిగిలేది ఇదే! ఈ ఆప్యాయతే. అనుబంధం. అనురాగం.

ఆమెలో గర్వపు భంగిమలు తగ్గిపోయి వుంటాయి. అశాంతిగా శ్వాస! బరువుగా కదలిక! ఆశతో ప్రతీక్ష! ముఖం ఎలా వుందో తెలియదు. ఎంత నల్లగా వుండి వుంటుందో అమావాస్య చీకటే సాక్ష్యం!

పదిగంటలు! రోడ్డు మీద దూరంగా వెలుతురు. ఆశగా నిలబడ్డారు. వెలుతురు దగ్గరకు వచ్చింది. చేతులెత్తారు. వెలుతురు ఆగింది. బస్సుకాదు. లారీ! కేబిన్ నిండా మనుష్యులు, నలుగురు ఆడవాళ్లు!

ఇద్దరు పురుషులతో ఒదిగిఒదిగి కూర్చున్నారు. లారీ నిండుగా వుంది.

గుంటూరు పోవలసిన రెండు బస్సులూ పొన్నూరులోనే వున్నాయి చెడిపోయి. ఇక రావు. ఖాళీ వుంటే తీసుకుపోయే వాడే డ్రైవర్. లేదు. అంతా చెప్పి వెళ్ళిపోయాడు.

అక్కకేమి చేయాలో తెలియలేదు. రాత్రికే గుంటూరు పోకతప్పదు.

'ఇక ఇంటికి వెళదాం మరి' తమ్ముడు కోపంగా చెప్పాడు.

'వద్దురా! రాత్రికే వెళ్ళాలి! ఏ లారీలో నైనా వెళదాం!'

'లారీలోనా?'

'ఆఁ! ఏం?'

'వద్దు! వాళ్ళు ఎలాంటి వాళ్ళుంటారో?'

'ఏం భయంలేదురా! మనుష్యుల్ని నమ్మక పోతే మానుల్ని నమ్ముతావా?'

'ఏమో! వద్దు! నా మాట విను! తిరిగి వెళదాం.'

'చెబుతుంటే వినాలి!' కఠినంగా చెప్పింది. ఆ కాఠిన్యానికి అతని గుండెలే అవిసిపోయాయి.

ఇక ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు. మౌనంగా నిలబడ్డారు. రాళ్ళ కంటే నిశ్శబ్దంగా వున్నారు. చెట్లు నిశ్శబ్దంగా లేవు.

దూరంగా లైట్లు. ఆశ! లైటు వచ్చింది. చేతులెత్తారు. లైటు ఆగింది. లారీ! కేబిన్‌లో ముగ్గురు మగవాళ్ళున్నారు. క్లీనర్ దిగాడు. సంభాషణ ముగిసింది.

తమ్ముడు ఎక్కి పురుషుల ప్రక్క కూర్చున్నాడు. కేబిన్‌లో ఎడంప్రక్క అక్క కూర్చుంది. కుడిప్రక్క తమ్ముడు. తమ్ముడు కుడిపక్క ఒకవ్యక్తి! ఆ వ్యక్తిప్రక్క డ్రైవర్.

'నేను వెనుక కూర్చుంటా' అంటూ క్లీనర్ ఆమె మెడవైపూ, చేతుల వైపూ చూచి వెళ్ళి రైట్ అనుకొని రైట్ అనగానే క్రీరుమని ధ్వనిచేస్తూ కదిలింది లారీ!

లారీ వెళుతూ వుంటే నిశ్శబ్దత చీల్చుకుపోయింది. చీకటి విశృంఖలత పెరిగింది."

* * *

ఎండ మాడిపోతూ వుంది. దూరంగా ఎర్రదుమ్ము. లారీ కాదు. బస్సు. గుంటూరు పోయే బస్సు. బస్సును చూస్తే పెన్నిధిని చూచినట్లుంది. బస్సు ఆగింది. జనం చెట్టి మీద నుంచి, చెట్ల క్రింద నుంచి బిలబిలలాడుతూ వచ్చారు. రోడ్డు కదిలినట్లయింది. అంతలోనే రెండో బస్సు వచ్చింది. రవి, వరతులూ రెండో బస్సు ఎక్కారు. అంతలోనే మూడో బస్సు వచ్చింది. మూడు గంటల్నుంచి దానివి, ఒకేసారి మూడు బస్సులు వచ్చాయి. జనం ఎక్కారు. ముందు జల బుట్టలు ఎక్కాయి. బస్సులు బయలుదేరాయి. ఒకదాని వెంట మరొకటి ఆత్మీయులైన స్నేహితురాండ్రులాగా.

వారాకోడూరు దాటి ఒకమైలు వచ్చిం తర్వాత బస్సులో వున్నవాళ్ళు 'అదుగో అక్కడే' అనుకొంటూ ఏమేమో చెప్పుకొంటున్నారు.

రవి యథాలాపంగా అటువైపు చూశాడు. కళ్ళవెంట నీళ్ళు తిరిగాయి. రాత్రి సంఘటనకు గురించే అందరూ చెప్పుకొంటున్నారు. వినలేక బాధ పడుతున్నాడు రవి. బస్సు బుడంపాడులో ఆగింది. 'వస్తా



కేరో అని వెంటనా దిగుతూ 'తేలు ఏలా వుందో' అని గొణుక్కున్నాడు.

'దురదృష్టవంతురాలు' అనుకొన్నాడు రవి.

* * *

"అర్ధరాత్రి పదిన్నర గంటలకు చేబ్రోలులో ఆగింది లారీ. డ్రైవర్, ఓనర్, క్లీనర్ లారీ దిగిపోయి, టీ తాగి, అర గంటకు తిరిగివచ్చారు.

కుడిప్రక్క నుంచి ఓనర్ వీరన్న ఎక్కి తమ్ముణ్ణి దాటి వచ్చి కూర్చున్నాడు. వీరన్న ప్రక్కనే డ్రైవర్ నాగులు వున్నాడు. లారీ బయలుదేరింది.

వీరన్న తేపతేపకూ ఆమెను ఆకలిగా చూస్తున్నాడు. తమ్ముడి వళ్ళు మండుతూ వుంది. డ్రైవర్ మత్తులో వున్నాడు. నాగులు వళ్ళు తెలియటంలేదు. వీరన్నా తాగాడు. కానీ అంత మత్తుగా లేడు. మరో విధంగా మత్తెక్కి పోతున్నాడు. క్లీనర్ లోడ్ మీద కూర్చున్నాడు.

తమ్ముడికి ఏదో తెలియని భయం. వారా కోడూరు స్టాండ్‌లోకి లారీ రాగానే ఆపి దిగిపోదామనుకొన్నాడు. అక్క ఒప్పుకోదని భీతి! లారీ ఆపరేమోనని శంక!

ఆమె బింకంగా కూర్చుంది. గుండె



విలవిలలాడుతూ వుంది. రక్తంలో ఆవేగం. ఊపిరి ఆడనంత యాతన. స్టాండ్ దాటి సుమారు మైలుదూరం వచ్చింది లారీ! డ్రైవర్ లారీని రోడ్డు తప్పించి ప్రక్కనే వున్న డొంకలోకి మళ్ళించాడు.

'రోడ్డు మీద పోనియ్' తమ్ముడు కోపంగా చెప్పాడు.


జవాబు లేదు.

'ఏయ్ లారీ తిప్పు! ఆమె కోపంగా అరిచింది వీరన్న పగలబడి నవ్వుతున్నాడు.

లారీ ఆగింది.

అక్కా, తమ్ముడూ ఆపద గుర్తించారు. ఎప్పుడు వచ్చాడో క్లీనర్ ఎడం ప్రక్క డోర్ తీసి, ఆమెను క్రిందికి లాగాడు. మెళ్ళో హారం తెంపుకొన్నాడు. చేతుల గాజులు లాక్కుంటున్నాడు

'అక్కా! వాణ్ణి తన్ను! పారిపో! ఎక్కడయినా దాక్కో' అంటూ ఉండగానే తమ్ముడు నోటి మీద చేయివేశాడు వీరన్న. తమ్ముడు చాచి వీరన్నను తన్నాడు. వీరన్న తూలి నాగులు మీద పడ్డాడు. తాగివున్న నాగులు డోర్ మీదపడి, అది తెరుచుకోగానే క్రింద పడ్డాడు.




తమ్ముడు ఎడంప్రక్కకు దూకాడు. క్లీనర్‌ని చాచి పొత్తికడుపులో తన్నాడు. 'అమ్మో' అంటూ కూలబడ్డాడు క్లీనర్.

'నువ్వుపో! పారిపో!'

'నువ్వూ రారా!'

'నువ్వుపో! వస్తాను. నువ్వుపో! పోవే! తంతాను.'

లారీకి కుడిప్రక్క పడ్డ నాగులూ, వీరన్న ఎడంప్రక్కకు వచ్చారు. ఆమె పొలాలలోకి పారిపోతూ వుంది. నాగులు ఆమె వెంట బడ్డాడు. వీరన్న తమ్ముణ్ణి పట్టుకొన్నాడు. వాళ్ళిద్దరూ చాలాసేపు పెనుగులాడారు. చివరికి వీరన్నను పడద్రోసి అక్క దగ్గరకు పోయాడు తమ్ముడు. నాగులుతో అక్క పెనుగులాడుతూ వుంది. తమ్ముడు నాగులు వళ్ళంతా బాదాడు. అయినా పట్టు విడువ లేదు. అక్కను పట్టుకొన్న నాగులు చేతుల మీద బలంగా కసిగా కొరికాడు. పట్టు తప్పింది. 'పరుగెత్తు. పరుగెత్తవే' తీక్షణంగా చెప్పాడు.

'నువ్వూ రారా!'

'వస్తాను పో! ఆదీపం చూడు అక్కడికి పో పో' ఆమె పరుగెత్తింది. 'ఏమండీ! ఏమండీ! ఎవరండీ అక్కడ!'

క్లీనర్, వీరన్న లేచి నాగులు దగ్గరకు పరుగెత్తుకువచ్చాడు.

డ్రైవర్ తమ్ముడు పెనుగులాడుతున్నారు. తమ్ముడు పారిపోవాలనీ, నాగులు పట్టుకోవాలనీ ప్రయత్నం. ఎవరికీ వీలు కావటంలేదు.

'ఇటే పరుగెత్తింది. పట్టుకోండి పోయి' నాగులు చెప్పాడు.

'ఎక్కడికి పోతుందిలే! వీడి సంగతే..' వీరన్న తమ్ముణ్ణి పట్టుకొన్నాడు. నాగులు చాచి కొట్టాడు.

'అక్కా!' అసహాయంగా తమ్ముడు అరిచాడు.

'ఏమండీ!' దీపం వైపు ఆశగా ఆమె పరుగెడుతూ వుంది.

ముగ్గురేకమై, ఒక్కణ్ణి, పసివాణ్ణి, కొడుతున్నారు.

'అక్కా! అక్కా!! అక్కా!!!'

'ఏమండీ! ఏమండీ!! ఏమండీ!!!' అక్క దీపం ఉన్నచోటికి చేరింది.

'ఎవరూ?' నులకమంచం మీద పడుకొన్న రాముడు బలహీనుడు, దుప్పటి తొలగించుకొని లేచి ప్రశ్నించాడు.

# అవాంఛితం

ఆమె చెబుతూ వుంది. అతను వింటు న్నాడు. అలజడి విన్నాడు. అర్థం చేసు కొన్నాడు.

'నువ్వుదాక్కో' అని, తాళాల గుత్తి బొడ్లోంచి తీసి, బేరన్ తలుపుతీసి, గొణిగి నట్టుగా 'లోపలికి పో' అని, అంతలోనే 'వద్దులే ఈ యింటిలోనే ఊపిరి బిగబట్టి దాక్కో. నీ తమ్ముడికేమీ భయంలేదు. దాక్కో తల్లీ!'

'అక్కా! అక్కా!! అక్కా!!!' మువ్మారు అరిచాడు.

'వస్తున్నా!' కఱ్ఱ తీసుకొని బయలు దేరాడు రాముడు.

'అమ్మా! అమ్మ!! అమ్మా!! ! అ—మ్మ—ఆ—' మళ్ళీ అరుపు వినిపించలేదు.

''అయిపోయింది! అయిపోయింది!'', రాముడు మూలిగాడు. కఱ్ఱ దూరంగా పారే శాడు.

ఎవరో పరుగెత్తుకు వస్తున్న అలికిడి వినిపించింది. 'వస్తున్నారు' అనుకొన్నాడు. పైకి అన్నాడు. ఆమె పాకలో వుంది. పాక ముందు కుక్కిమంచం మీద పడుకొని దుప్పటి కప్పుకొన్నాడు రాముడు.

వాళ్ళు వచ్చారు. 'ఏయ్! ఎవరు నువ్వు?' రాముడు ఆవులించాడు.

'ఎవరు నువ్వు?'

'నేనా?—ఎవరు కావాలి మీకు?'

'ఇటు ఎవరన్నా వచ్చారా?'

'లేరే! ఆ—ఏదో అలికిడి అయింది. బేరన్ ప్రక్క ఎవరో పరుగెత్తినట్టు న్నారు బేరన్‌లోకి పోయారో ఏమో—బేళ్ళు న్నాయి. అమ్మో—దొంగలా—వెంకన్నగారి పొగాకు వేల ఖరీదు చేస్తుంది. దొంగలా?'

'కాదు. ఆడమనిషి!'

'ఆడమనిషా' మీకెవరి కన్నా భార్యా? పారిపోతుందా? రాత్రి బేరన్ తాళంవేశానో లేదో!'

'చూస్తాను' క్లీనర్ వెళ్ళాడు. 'తాళం తీసి వుంది.' పెద్దగా అరిచాడు. 'లోపల కదలిక.'

'ఆ! పదండి. వెతకండి. లోపల, దాక్కొని వుంటుంది!' ముగ్గురు లోపలికి పోయారు.

రాముడి తలలో మెరుపు మెరిసింది. తలుపు చెక్కలు దగ్గరకు లాగాడు. గొళ్ళెం పెట్టాడు. తృప్తిగా గాలి పీల్చుకొన్నాడు. 'అమ్మ! అమ్మ' లోపలికి పోయాడు. పాకలో కిరోసిన్ దీపం వెలుతురులో ఆమె కని పించింది. స్పృహతప్పి పడివుంది ఎండుగడ్డి మీద. పాకలోంచి వెలుపలికి వచ్చాడు. బేరన్ తలుపు మీద గట్టిగా కొడుతున్నారు లోపల్నుంచి. చెక్క పగిలినట్లు ఓటి మోత వచ్చింది. రాముడు గుండెలో దడ బయలుదేరింది. వాళ్ళు వస్తారు. వచ్చే స్తారు. ఎట్లా! ఎట్లా!! ఆవేగంగా వుంది. రెండుక్షణాలు తటపటాయించాడు. తనని చంపుతారు అనుకొన్నాడు. ఎండుగడ్డి నాలుగు పనలు వాకిలి దగ్గర పడేశాను. కిరోసిన్ దీపం తీసుకుపోయి ఆయిల్ గడ్డి మీద పోసి, ఒత్తి గడ్డి మీద పడేశాడు మంట! గడ్డి అంటుకొంది. వాకిలి అంటు కొంది. లోపల వేల ఖరీదు చేసే పొగాకు బేళ్ళు అంటుకొన్నాయి. ఎవరు బైటికి రాలేదు. కఱ్ఱ తీసుకొని వాకిట్లో నిల బడ్డాడు.

'చావండి. నక్కల్లా చావండి. కుక్కల్లా నీచంగా చావండి. భార్యను భర్తకూ, కూతుర్ని తండ్రికీ కాకుండా చేసే దుర్మార్గుల్లారా చావండి. పాపాలన్నీ తలుచుకొంటూ చావండి! చావండి!!''

రాముడు విపరీతంగా నవ్వుతూ, వున్నాడు. పగలబడి నవ్వుతున్నాడు. క్రూరంగా, కసిగా, ద్వేషంగా నవ్వుతున్నాడు. భయంకరంగా, భీతావహంగా, రాక్షసంగా నవ్వుతున్నాడు.

పారాకోడూరు నుంచి జనం వచ్చేసరికి బేరన్‌లో బూడిద వుంది. నవ్వినవ్వి స్పృహ తప్పి పడిపోయిన రాముడూ, పాకలో స్పృహ లేకుండా అక్క, డొంక ప్రక్క ప్రాణం లేకుండా తమ్ముడూ కనిపించారు. తెల్ల వారింది.''

* * *

గుంటూరు బస్‌స్టాండ్‌లో బస్సు ఆగింది. అక్కడంతా రాత్రి జరిగిన సంఘటనను గురించే చెప్పుకొంటున్నారు. ఆమెను హాస్పటల్లో చేర్చారని అక్కడే విన్నాడు, రవి.

ఆమెను చూడాలనిపించి, హాస్పిటల్‌కు వెళ్ళాడు.

రవి, స్పృహ లేకుండా వున్న ఆమెను నీళ్ళు నిండిన కళ్ళతో చూశాడు.

ఆమె మెడికల్ స్టూడెంట్. పేరు, వి. వసంత! ●


పుస్తకములు

5 పుస్తకముల పెట్టె రు. 5-50.
(1) కొక్కోకశాస్త్రం (2) సుహాగ్‌రాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసన ములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/-. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.

SULEKHA TRADERS.
WAT-7) .Beat No. 13, Aligarh

3 వేలు ఉచిత బహుమతి!

అందమైన స్త్రీలకు మిక్కిలి నూతనమైన ఆకర్షణీయ మైన డిజైనులలో రంగులలో పరిక్రొత్త కాశ్మీర్ ఆర్ట్ చీరెలు వచ్చియున్నవి. పెద్ద సైజులలో మాత్రమే లభించును. 1 డీలక్స్ చీర రు. 11/- 2 కి రు. 20/- 3కి రు. 28/- 4కు రు. 36/- రెండు లేక అంతకు పై చీరెలకు ఆర్డరు పంపిన వారికి బ్లౌజు గుడ్డ ఉచితం పై ఆర్డరున పోస్టు పార్శిల్ ద్వారా పంపబడును.



ARVIND AGENCIES (WAP-22)
P. B. 1408, Delhi-6.

తెల్ల మచ్చలకు ఉచిత వైద్యము

శక్తివంతమైన మా ఆయుర్వేద ఔషధము "శ్విత్ర మోచన్" తెల్ల మచ్చలను కొద్ది రోజులలో తొలగించును. సాంఘిక సంక్షేమం కొరకు 1000 రోగులకు ఒక్కొక్క పాకెట్ ఉచితంగా యివ్వబడును. వెంటనే వ్రాయండి.

BIHAR KUSTA KUTIR
(2) P.O. Lalbigha (Gaya)

సలహా

కోల్పోయిన ఆనందం, బలం, శక్తిని తిరిగి యిచ్చేందుకు ఆహ్లాదకరమైనది. నరాల బలంకు పైపూతకు వాడే తైలం. 1 సీసా రు 11-50 స్పెషల్ రకం అర్జంటు గుణంకు రు. 27/- ఎడ్రెస్సు పంపుతూ జవాబుకు కవరు పంపాలి.

డాక్టర్ రత్నం సన్స్,
Sex Specialists (Estd 1904)
జాంపురా మార్కెట్ వద్ద, మలక్‌పేట బిల్డింగ్స్, హైదరాబాద్-36 (ఆంధ్రప్రదేశ్)